కంటి తుడుపు వాన

- వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్
- నిరాశ పరిచిన వరుణుడు
- డేంజర్ జోన్‌లో వరి, పత్తి, మొక్కజొన్న

జనగామ: రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు జనగామ జిల్లాలో భారీ వర్షం(ఎల్లో అలర్టు) కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఒక్కరోజు ముందుగానే ప్రకటించింది. ఇరవై రోజులుగా వర్షం జాడలేకపోవడంతో వరి నార్లు, నాట్లు, పత్తి, మొక్కజొన్న, ఇతర ఆరుతడి పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న తరుణంలో వాతావరణ శాఖ ప్రకటనతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. కానీ, సూరీడు మండిపోవడంతో నిరాశకు గురయ్యారు. సరిగ్గా మధ్యాహ్నం చిరుజల్లుతో మొదలై.. మోస్తరు వర్షం కురిసింది. కొనఊపిరితో ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ప్రాణం పోస్తుందనుకుంటున్న సమయంలో వర్షం ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరైన ప్రజలు చల్లదనాన్ని ఆస్వాదిస్తే... రైతులకు మాత్రం తీవ్ర ఆవేదనను మిగిల్చి వెళ్లింది. జిల్లాలో చిల్పూరు మండలంలో 52.3 మిల్లీ మీటర్లు, స్టేషన్‌ఘన్‌పూర్ లో30.3 మి.మీ, లింగాలఘనపురంలో 19.5మి.మీ, తరిగొప్పుల19. 0మి.మీ, జనగామ 15.0 మి.మీ, జఫర్‌గఢ్ 11.3మి.మీ, బచ్చన్నపేట 9.8మి.మీ, నర్మెటలో 1.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.


జనగామ ఆర్టీసీ చౌరస్తాలో కురుస్తున్న వర్షం


గొడుగుతో మహిళ


వర్షంలో వెళ్తున్న యువతులు

గోదావరి జలాలతో చెరువులు నింపాలి


జనగామ రూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: గోదావరి జలాలతో జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు నింపాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పలు మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆశించిన రీతిలో వర్షాలు కురువక రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారని, కొద్దో గొప్పో వేసిన పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. అనంతరం తహసీల్దార్లకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

- డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కయ్య

జఫర్‌గఢ్: ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని చొక్కయ్య పేర్కొన్నారు. డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో చొక్కయ్య మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యాయన్నారు. 2024 నుంచి ఇప్పటి వరకు 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు రిటైర్ అయినా వారికి రావాల్సిన బెనిఫిట్స్ అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చివరికి జీపీఎఫ్‌లో నెలవారిగా పొదుపు చేసుకున్న డబ్బులు కూడా రాకుండా పోయాయన్నారు. సమస్యలపై రాజీలేని పోరాటాన్ని సాగిస్తామని ఆయన తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి దూడయ్య, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వేణుగోపాల్, శ్రీకాంత్, జైసింగ్‌రాథోడ్, సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి

కొడకండ్ల/బచ్చన్నపేట: మానవాళి మనుగడకు దోహదపడే మొక్కలను ప్రతీఒక్కరు నాటాలని వైద్యాధికారి హరికృష్ణ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బచ్చన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో వన మహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి, ఏపీఓ కృష్ణ, మండల వైద్యాధికారి డాక్టర్ సృజన, ఉమాదేవి, క్రాంతి స్వరూప్ పాల్గొన్నారు.

రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

లింగాలఘణపురం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువుల చేయూత పింఛన్ రూ.4వేలు ఇవ్వాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమరాజు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో దివ్యాంగుల, చేయూత పింఛన్‌దారుల సంయుక్త సమావేశం మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని, ఈ నెల 29న జిల్లా కేంద్రంలో చేయూత పెన్షన్‌దారుల మహాసభ నిర్వహించడం జరుగుతుందని అందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, ఐలయ్య, చంద్రయ్య, యాదగిరి, మల్లయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన పరికరాలను వినియోగించండి

- డీఈ లక్ష్మీనారాయణ

నర్మెట: రైతులు వ్యవసాయ బావులవద్ద, గృహ విద్యుత్ వినియోగదారులు నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించి ప్రమాదాలను నివారించాలని విద్యుత్‌శాఖ డీఈ లక్ష్మీనారాయణ కోరారు. హన్మంతాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజ్ సమస్యల పరిష్కార నిమిత్తం గురువారం అధనపు పీటీఆర్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పనులు చేయరాదని, ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సిబ్బందికి తెలియజేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోరాదని అన్నారు. కార్యక్రమంలో ఏడీఈ అనిల్ కుమార్, ఏఈ సుధాకర్, టీఆర్‌ఈ ఏఈ కుమార్, ఎస్ఎల్ఐ రాజయ్య, ఎల్ఐ బాలు, ఏఎల్ఎంలు రాజేందర్, హేమంత్, శ్రీకాంత్, కిషన్, కాంట్రాక్టర్ హెబ్నేజర్ తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభంలో డీఈ లక్ష్మీనారాయణ

క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

లింగాలఘణపురం: మహిళలు నేడు అన్నీ రంగాల్లో రాణిస్తున్నారని, వారంతా ఆర్థికంగా ఎదగాలని మహిళా సాధికారత సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శారద కోరారు. గురువారం మండల కేంద్రంలో మోడల్ స్కూల్‌లో బేటి బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల భద్రత, రక్షణ, లైంగిక వేదింపులు, వివక్ష, వృద్ధుల సంరక్షణ, ఆర్థిక అక్షరాసత్యపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, రాణి, ఏఏపీసీ అధ్యక్షురాలు పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం



పాలకుర్తి టౌన్: టీపీసీసీ ఉపాధ్యక్షురాలుగా నియమితులైన హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని గురువారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ సోషల్ మీడియా కన్వీనర్ చల్లా ఉపేందర్‌రెడ్డి కలిశారు. అనంతరం ఆమెకు మొక్క అందజేసి సన్మానించి అభినందిచారు.

దరఖాస్తుల ఆహ్వానం



స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రస్తుత విద్యాసంవత్సరం నూతనంగా ప్రారంభమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ కె.నవీనరాణి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహత్‌ఖానమ్ ఆదేశాల మేరకు ఘన్‌పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన కరపత్రాలను కళాశాల ఫ్యాకల్టీ గురువారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అన్నగాని శ్రీనివాస్‌గౌడ్, సీహెచ్.నర్సింహులు, డాక్టర్ ఏ.రాజేంద్ర నాయక్, సీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


భూమిపూజ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

బచ్చన్నపేట: అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ బండనాగారం గ్రామ శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి భూమి పూజ చేశారు. కార్యదర్శి భరత్, నాయకులు రాములు, రాజలింగం పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరింది

పాలకుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదల సొంతింటి కల నెరవేరుతోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని మల్లంపల్లి, పాలకుర్తి, గూడూరు, ఎల్లరాయని తొర్రూరు గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమార్, చిట్యాల ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, వెనుకబడిన వర్గాల రాష్ట్ర కార్యదర్శి పులి గణేష్, రాష్ట్ర సేవాదళ్ నాయకుడు ఆదినారాయణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే చదవాలి



చిల్పూరు: బడీడు పిల్లలు ప్రభుత్వ బడుల్లోనే చదవాలని, అప్పుడే దాతల సహాయసహకారాలు అందుతాయని జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా చైర్మన్ పొగాకుల విష్ణువర్ధన్‌గౌడ్ అన్నారు,. శ్రీపతిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన ఎంఈఓ దాసరి గోవర్ధన్‌తో కలిసి క్రీడా దుస్తులు, స్కూల్ బ్యాగులు, గొడుగులు గురువారం పంపిణీ చేశారు. కేశిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలబోయిన నరేష్, మోతె ఉపేందర్, చిరంజీవి, రాకేష్ పాల్గొన్నారు.

మహిళలను చులకనగా చూడొద్దు

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: వీరనారి చాకలి ఐలమ్మ జన్మించిన పాలకుర్తి గడ్డపై మహిళలను చులకగా చూస్తే సహించేంది లేదని ఎమ్మెల్యే మామిడాల యశ్వసినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబురాలకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై భర్తలపై ఆధారపడకుండా పాలన సాగించాలని సూచించారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. 408 మహిళా సంఘాలకు రూ.34 కోట్లు బ్యాంక్ రుణాలు, రూ.13 కోట్లు వడ్డీ లేని రుణాలు అందించగా తొర్రూరు, దేవరుప్పుల మండలాలకు ఆర్టీసీ బస్సులు రూ.1.40 కోటి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ వసంత, ఏపీడీ నూరొద్దిన్, మంజుల, అభిగౌడ్, నరేందర్, రమణాచారి, సత్యనారాయణ పాల్గొన్నారు.


మహిళలకు వడ్డీ రుణాల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

పాలకుర్తి, దేవరుప్పుల మండలాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంల్నో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడూ పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తే కొత్త వారికి అవకాశం ఇస్తామని హెచ్చరించారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ఫేస్ -3లో పనుల పూర్తయ్యాయని సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. నీటిపారుదల శాఖ ఎస్‌ఈ సుధీర్, ఈఈలు రమేష్, ప్రవీన్, డీఈలు శ్రీకాంత్, సునిల్, శ్యాం, పూర్ణచందర్ పాలొన్నారు. ఇదిలా ఉండగా.. నియోజకవర్గంలోని 158 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు.

నిరుపేదల అభ్యున్నతే లక్ష్యం

కొడకండ్ల: నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా పేదల ఆరోగ్య విషయంలో అండగా ఉంటూ భరోసాగా ఉంటామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 19 మంది లబ్ధిదారులకు రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు మసురం రవిందర్,యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి

నర్మెట: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వాసవీ క్లబ్ లింగాల గణపురం, లయన్స్ క్లబ్ జనగామ అధ్యక్షుడు గొడిశాల శివ రామకృష్ణ అన్నారు. మల్కపేట పాఠశాల విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగరాజు కేశవరావు, క్లబ్ ప్రధాన కార్యదర్శి దేవునూరి వెంకటేశ్వర్లు, నాగమల్ల సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నిక


నిరసన తెలుపుతున్న నూతన కమిటీ, ప్రతినిధులు

జనగామ: జిల్లా ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గురువారం రాష్ట్ర నాయకులు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా సోనాబోయిన ఉమేష్, కార్యదర్శిగా దేవునూరి శ్రీకాంత్, కోశాధికారిగా గోరంట్ల దేవేందర్, ఉపాధ్యక్షులుగా బండి శ్రీనివాస్, భాను, డిజిటల్ జనగామ ఉపాధ్యక్షుడిగా అక్కల రమణశ్రీ, గౌరవ సలహాదారులు అక్కెనపల్లి పురుషోత్తంచారి, డిజిటల్స్ సంఘం గౌరవ అధ్యక్షులుగా బోయిన ఈశ్వర్, బెజ్జర బోయిని వెంకటేష్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం ఫ్లెక్సీ తయారీ, ముడి సరుకు ధరల పెంపును నిరసిస్తూ ధర్నా చేపట్టారు. కస్టమర్లకు నష్టం జరుగకుండా, యూనియన్ పరంగా నిర్ణయించిన ధరలకే ఫ్లెక్సీ ప్రింటింగ్ చేయాలన్నారు.

జీవో రద్దు చేయండి

జనగామ: సెలూన్ దుకాణాలను నాయీబ్రాహ్మణులే కాకుండా ఎవరైనా ఏర్పాటు చేసుకోవచ్చని హైకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని పట్టణ నాయీబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ఎలకంటి వెంకటేశ్, కార్యదర్శి గజ్వెల్ల గణపతి, కోశాధికారి దాచపల్లి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తీర్పుతో నాయీబ్రాహ్మణులకు నష్టం జరుగుతుందని, జీఓను రద్దు చేయాలని వేడుకున్నారు.

'సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం'

జనగామ రూరల్: రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి రెడ్డి అన్నారు. గురువారం పెదరాంచెర్ల గ్రామంలో ఎండిన పంటలను ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కల్లెం రాజు, యాకుబ్ పాషా, గులాం బాయి, రిజ్వాన్, ఉడుత రాజు. పుల్లే నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: అశ్వారావుపల్లి, బొమ్మకూరు రిజర్వాయర్ల నుంచి సాగు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చెరువులు నింపాలని మండల రెవిన్యూ అధికారులకు మెమోరాండం అందజేశారు. బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్ ముసిపట్ల విజయ్, మాజీ సర్పంచ్ పెండ్లి మల్లారెడ్డి, కొర్ర రాజేందర్‌నాయక్ పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: నియోజకవర్గలలో రైతులు తీవ్రవర్షాభావ ప్రభావంతో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతులకు సాగు నీరు విడుదల చేయాలని బీఆర్‌ఎస్ మండ అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి దయాకర్‌రావు శుక్రవారం ఉదయం కాల్వాల పరిశీలించనున్నట్లు అయన తెలిపారు.

దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి

జనగామ రూరల్: పెండింగ్‌లో ఉన్న పింఛన్లు మంజూరు చేసి దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు పాముకుంట చందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎన్పీఆర్డీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సుహాసినికి వినతి పత్రం అందజేశారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, పిట్టల కుమార్, వెంకటమ్మ, శ్రీనివాసరావు, మహేష్, రావుల శ్రీనివాస్, బాల్తే మని పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

'బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి'

జనగామ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మహమ్మద్ గులాం, ఇర్రి రమణారెడ్డి, మహ్మద్ యాకూబ్‌పాషా, మహ్మద్ రిజ్వాన్ అన్నారు. గురువారం ఓబుల్ కేశపురం, పెద్ద రాంచర్ల గ్రామల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు.

సమన్వయంతో కలిసి పనిచేయాలి

తరిగొప్పుల: స్థానిక సంస్థల ఎన్నికల ఎప్పుడూ వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. అధికార ప్రతినిధి చిలువేరు లింగం అధ్యక్షతన గురువారం నర్సాపూర్, అబ్దుల్‌నాగారం గ్రామాల్లో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. క్లస్టర్ ఇంచార్జులు జూకంటి శ్రీశైలం, నీల యాదగిరి, దండు ఉపేందర్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేయాలి

బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని మండల ఇన్‌చార్జ్‌లు గద్దల నర్సింగారావు, పెద్ది రాజిరెడ్డి అన్నారు. కొడవటూర్ గ్రామంలోని సిద్ధేశ్వరాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు మిన్నాల పురం కనుకయ్య, నాయకులు కర్ణాకర్ పాల్గొన్నారు.

స్థానికంలో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

కొడకండ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ పార్టీకి త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ ఎంపీటీసీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు దేశగాని సతీష్‌గౌడ్, మంగ్యానాయక్, భాస్కర్‌రెడ్డి కోరారు. రేగుల, రేగులతండాల్లో నిర్వహించిన క్లస్టర్ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. బల్ల మల్లయ్య, రాజమల్లారెడ్డి, సోమయ్య, వెంకట్‌రెడ్డి, యాకన్న, వెంకటయ్య, యాకయ్య, విజయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్‌లోని దుండిగల్‌కు చెందిన ఎనిమిదేళ్ల బాలుడు గణేష్ తప్పిపోయి స్టేషన్ ఘన్‌పూర్‌కు రాగా స్థానిక పోలీసులు గుర్తించి తిరిగి బాలుడిని అతడి తల్లికి అప్పగించిన సంఘటన గురువారం జరిగింది. సీఐ జి.వేణు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ పరిధిలోని దుండిగల్‌కు చెందిన బాలుడు గణేష్ నమిలిగొండలో ఈనెల 16న ఒంటరిగా కనిపించడంతో గ్రామస్తులు 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. దాంతో గ్రామానికి చేరుకున్న పోలీసులు బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు సేకరించినట్లు చెప్పారు. తన పేరు గణేష్ అని, అమ్మ పేరు పుష్పలలీల, సికింద్రాబాద్ నుంచి రైలులో స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చినట్లు, అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా నమిలిగొండకు వచ్చినట్లు తెలిపారు. బాలుడి అడ్రస్ గుర్తించి అతడి తల్లికి అప్పగించినట్లు సీఐ తెలిపారు. కాగా, తప్పిపోయి వచ్చిన బాలుడిని ఒక రోజు వ్యవధిలోనే తిరిగి తల్లికి అప్పగించిన స్థానిక పోలీసులను పలువురు అభినందించారు.


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. సాక్షిలో ప్రచురితమైన 'కళాశాలలో సమస్యల తిష్ట' శీర్షికన ప్రచురితమైన కథనానికి ప్రిన్సిపాల్ స్పందించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయ్యాయని, వాటితో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా మౌలిక వసతుల కోసం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

నేత్ర వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: హనుమకొండకు చెందిన శరత్ మ్యాక్స్ సూపర్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి సహకారంతో స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మోడల్ కాలనీలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాలనీకి చెందిన 50 మంది వైద్య శిబిరానికి హాజరుకాగా శరత్ ఆస్పత్రి వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన 6గురిని రిఫర్ చేశారు. శివునిపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గౌరిశెట్టి అనీల్, మాజీ అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి, లయన్ రవికిరణ్, ఆమంచ మధుసూదన్, కోతి వేణు, ఆమంచ మధుసూధన్ పాల్గొన్నారు.

రాజు మృతి పార్టీకి తీరని లోటు

జఫర్‌గఢ్: బీజేపీ బూత్ అధ్యక్షుడు చందా రాజు ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. తిడుగు గ్రామానికి చెందిన రాజు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వెంకటేశ్వర్లు పార్టీ బృందంతో కలిసి గురువారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి నివాళులర్పించారు.

సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

పాలకుర్తి టౌన్: సమాజ సేవను ప్రథమ లక్ష్యంగా పెట్టుకుని లయన్స్ క్లబ్‌లు పని చేస్తున్నాయని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో లయన్స్ క్లబ్ పాలకుర్తి 25వ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా చారగొండ్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా దేవసాగని కృపాకర్, కోశాధికారిగా సంతోష్ ప్రమాణ స్వీకారం చేసి భాధ్యతలు స్వీకరించారు.

నిత్యావసరాల అందజేత

దేవరుప్పుల: సీతారాంపురం శరణాలయంలోని అనాథ వృద్ధుల మధ్య కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు గురువారం జన్మదిన వేడుకలు నిర్వహించి పండ్లు, పది రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. ఆశ్రమానికి సాయం అందించిన నాగరాజుకు నిర్వాహకులు బ్రహ్మచారీ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

టీవీల బహూకరణ


శ్రీదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పరస్పర బదిలీపై వెళ్తున్న సందర్భంగా శ్రీదేవి, ఎస్ఆర్‌ఐ కోరెం శ్వేత హిరెన్ ప్రతాప్‌రెడ్డి రూ.40 వేల విలువ చేసే రెండు టీవీలను గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎండీ పర్వేజ్ మాట్లాడారు. అనంతరం శ్రీదేవిని సత్కరించారు. హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, సోమయ్య, శ్రీనివాస్, అనిత, తిరుమలాదేవి, భీమ్రావు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' మంజూరు పత్రాల పంపిణీ

బచ్చన్నపేట: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు గురువారం రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ పంపిణీ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని అన్నారు. విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని అన్నారు. చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణంరాజు, అనిల్‌రెడ్డి, రాజు, స్వామి పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యలో కంప్యూటర్ల వినియోగం



దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలల్లోను ప్రాథమిక విద్యాభివృద్ధి కోసం కంప్యూటర్ల వినియోగం ఆవశ్యకత అనివార్యమైందని ఎంఈఓ జి.కళావతి అన్నారు. గురువారం మాధాపురం ప్రాథమిక పాఠశాలలో దాతలతో సమకూర్చిన కంప్యూటర్ ల్యాబ్‌లో ఏఐ ఎక్స్‌ఎల్ తరగతులను ఆమె ప్రారంభించారు. కోలుకొండ స్కూల్ కాంప్లెక్సు హెచ్‌ఎం వెంకన్న, పీఎస్ హెచ్‌ఎం నల్ల లలిత, హైస్కూల్ హెచ్‌ఎం రమేష్, ఎస్ఎంసీ, చైర్‌పర్సన్ వి వసంత,ఉపాధ్యాయులు సుజీత్,జీవన్, నర్సయ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభినందనీయం

చిల్పూరు: పాఠశాల అభివృద్ధికి పంచాయతీ కారోబార్ కృషి చేయడం అభినందనీయమని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పల్లగుట్ట గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కారోబార్, పాఠశాల అభివృద్ధి కమిటీ మెంబర్ జీడి ఆనందం సొంత ఖర్చులతో 40 ట్రిప్పుల మొరం పోయించారు. దీంతో పలువురు ఆయనను అభినందించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల శివారు ఆర్టీసీ కాలనీకి చెందిన బద్ధం సందీప్‌రెడ్డి (29) బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. సందీప్‌రెడ్డికి ఇటీవల ఓపెన్‌హార్ట్ సర్జరీ కావడం, దీంతో ఆరోగ్యం కుదుట పడక అప్పుడప్పుడు చాతిలో నొప్పి రావడంతో బాధ భరించలేక ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి సోదరి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఆ బ్యాంకు మేనేజర్ గురుప్రీత్ సింగ్ కోరారు. గురువారం వీఎస్ఆర్ నగర్‌లో బ్యాంకు మిత్ర కోనేటి వాణిశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్తులకు బ్యాంకు సేవలను అందించేందుకు బ్యాంకు మిత్రలను ఏర్పాటు చేశామన్నారు. మాజీ సర్పంచ్ కోనేటి స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

రఘునాథపల్లి: మండలంలోని కోమళ్లలో వరుణుడు కరుణించాలని శనివారం గ్రామస్తులు గ్రామ దేవతలకు నీటితో జలాభిషేకం చేశారు. ఇంటింటి నుంచి మహిళలు నీళ్ల బిందెలు నెత్తిన పెట్టుకొని గ్రామ దేవతల వద్దకు వెళ్లారు. నీటితో జలాభిషేకం చేసి, కొబ్బరి కాయలు కొట్టి వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. మాజీ సర్పంచ్ బండి యాదగిరి, సుల్తాన్ విజయలక్ష్మి, బొల్లపల్లి మంజుల పాల్గొన్నారు.